# మా వూరి పులి

"ఈ వూళ్లో నేను పులిని, నా కెదురు లేదు. నన్ను చూస్తే ఊరంతా భూకంపం వచ్చినట్టు గజగజ లాడవల్సిందే! ఊరిమీద సవాల్! రౌడీ రంగన్న పేరు చెబితే ప్రజలగుండెలలో రైళ్లు పరుగెత్తాల్సిందే" అంటూ వుంటాడు మా వూరు పులి రంగన్న కోరమీసం దువ్వుతూ.

రంగన్న నిజంగా మా వూరుపులే. ఆ బిరుదును వాడికి వాడే తగిలించుకున్నా, ఊరివాళ్లు కాలక్రమేణా ఒప్పుకోక తప్పలేదు. "పులి రంగన్నా!" అని పిలిచినా, "రౌడీ రంగన్నా!" అని పిలిచినా వాడికెంతో సంతోషం. ఇట్టే పరవశుడవుతాడు. సంఘానికి, తోటిమానవులకు, దేశానికి మంచి పనులు చేసి "మంచివాడు"గా కీర్తిగడించడంలో ఎంత ఆనందమున్నదో సంఘానికీ, తోటిమానవులకూ, దేశానికీ చెడ్డపనులు చేస్తూ "చెడ్డవాడు"గా అపకీర్తిని పొందడంలో అంత ఆనందమున్నట్లు రంగన్న జీవితాన్ని పట్టిచూస్తే బోధపడుతుంది.

మంచి వయస్సులో వున్న పోట్లగిత్తలాంటివాడు రంగన్న. ఆరడుగుల ఎత్తు. అందుకు తగిన శరీరదార్ఢ్యం గలవాడు. ఆజానబాహుడు. మొహం భయంకరంగా వుంటుంది. జులపాలజుత్తు, కోరమీసాలు, గళ్ళ లుంగిపైన గ్లాస్కోలాల్చీ, మెడలో ఆంజనేయస్వామివారి లాకెట్ గల బంగారు గొలుసు చూడగానే వీడు రౌడీలకు "రౌడీ" అన్న భావం ఇట్టే కలుగుతుంది ఎవరికైనా. రంగన్న జీవితాశయం కూడా అలాగే బ్రతకాలని. అన్ని వేళలా జేబులో కత్తిపెట్టుకు తిరుగుతూ వుంటాడు. అతనికి ప్రక్కనే నలుగురు చిన్న రౌడీలు అండగా నిలబడుతూ, గురువుగారికి పొగడ్తల ధూపం వేస్తూవుంటారు.

ఆ వూళ్లో రంగన్నకు తగిన బలగంవుంది. రాజకీయమైన సమర్థన, అధికార బలంగలవారి అండదండలు, షావుకార్ల ఆర్థిక సహాయం వాడికున్నాయి. ఇన్నింటిని మించి స్వతహాగా వాడు ధైర్యశాలి, సాహస విక్రమార్కుడు. ఎదురు రొమ్మిచ్చి ఎదురొడ్డగల మొండిఘటం. అతి దుష్టుడు, దుర్మార్గుడు, కిరాతకుడయిన రంగన్నకు అలాంటి సమర్థనా, అండదండలు, ఆర్థిక సహాయం ఏమిటి అనుకోవచ్చు. కాని, ఈ నాటి రాజకీయ రంగంలో, అధికార వ్యామోహంలో, పై ఎత్తుగా బ్రతకాలనే ఆ కాంక్షలో రౌడీలను పోషించాల్సిన బాధ్యత, అగత్యం కొంతమంది నాయకులకు లేకపోలేదు. అందువల్లనే పల్లెటూళ్లలో కానివ్వండి, పట్టణాలలో కానివ్వండి రౌడీలరాజ్యాన్ని నిరాటంకంగా సాగిస్తున్నారు,

మా వూరి పులి పాలనలో ఇంతవరకు ఏడు హత్యలు ఇరవై ముగ్గురు స్త్రీల మానభంగాలు, లెక్కలేనన్ని దొంగతనాలు గృహదహనాలు జరిగాయి. ఊళ్ళో ఏ దుర్మార్గం జరిగినా అందులో రౌడీ రంగన్న పాత్ర ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వుండివుంటుంది. ఒకసారి మా గ్రామ సేవికను రంగన్న మానభంగం చేయగా వీధి అరుగులమీద కూర్చున్న పెద్ద మనుష్యులు అదేమని అనలేక పోయారు. పాపం! ఆ యువతి పెళ్ళికాని పడుచు. తర్వాత నాలుగు మాసాలకు తను గర్భవతి అయినట్టు తెలుసుకొని, సాంఘికమైన అప్రతిష్ఠకు వెరచి, ఆత్మహత్య చేసికుంది.

మరొకసారి పల్లె వాళ్ళు తమ ప్రెసిడెంట్ పార్టీకి ఎలక్షన్లో వోట్లివ్వలేదని - తెల్లవారేపాటికి పల్లెపల్లెంతటినీ బూడిద రూపంలో మార్చాడు. మరొకసారి తమ షావుకారిని తిట్టాడనే ఆరోపణమీద నడమంటి వీధి సుబ్బరాయుణ్ణి నడిబజారులో గండ్రగొడ్డలితో నరికి ఆ నెత్తురుతో కోరమీసం దువ్వుకున్నాడు. ఆ హత్యకు సాక్ష్యమూ లేదు. కేసూ లేదు. మా వూళ్లో రంగన్నను చూస్తే అటు ధనికులూ, ఇటు పేదవారు - మధ్యన మధ్య తరగతి ప్రజలు దడుస్తారు. పదెకరాల గడ్డగల ఏ రైతును రంగన్న పదిరూపాయలడిగినా మారు మాట్లాడకుండా ఇవ్వాల్సిందే! లేకుంటే ఏ అర్ధరాత్రి ఏ ధాన్యపు కుప్పకు నిప్పు పడతాడనే భయం. ఊళ్లో అన్ని హోటళ్లలోను కాఫీ, ఫలహారాలూ ఉచితం, కిళ్లీ బడ్డీలలో సిగరెట్లు ఫ్రీ

కాపుసారా కుతికి పట్టినంత. ఆ విధంగా రంగన్న "మావూరు పులి"గా చెలామణీ అవుతున్నాడు.

మా నిమ్మతోట కాపు అమ్మకానికి ఒక రోజు ఉదయం మా వూరు వెళ్లాను. బేరగాళ్లతో బేరం చేస్తూ నేను తోట దగ్గర మంచెమీద కూర్చున్నాను. మా తోటకు ఫర్లాంగు దూరంలో బ్రాంచి కెనాల్ ఉంది. ఆ కెనాల్ ఒడ్డుపై ఓ పాతిక ముప్పైమంది వరకు జనం గుమికూడి ఉన్నారు కేకలు వేస్తూ. నేను నలుగురు కూలీలు, తోటబేరగాళ్లు గబగబా అటు కేసి వెళ్లాం. మాతో పాటు మున్సబుగారి అరటి తోటకు నీటి తడికట్టే వాళ్లు, నాయుడుగారి కేబేజీ తోటలో పని జేసేవాళ్లు పరుగెత్తుకొచ్చారు.

బ్రాంచి కెనాల్ ఒడ్డుపై గుమికూడిన జనం ఒక్కసారి చెల్లాచెదరై పరారైనారు. "పులి! పులి!" అంటూ బిగ్గరగా కేకలు వేశారు.

నేనాశ్చర్యపోయి నిలబడ్డాను. నిజమైన పులియా! లేకపోతే మా వూరు పులియా!

అంతలోనే చేతిలో బరిసెతో మా వూరు పులిరంగన్న బ్రాంచి కెనాల్ ఒడ్డు ఎక్కి పొలాలలోకి పరుగెత్తసాగాడు. అతని వెంట పెద్దపులి పడింది. దగ్గరలోవున్న తాటిచెట్టు ఎక్కాడు రంగన్న. అతను ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకొని గబగబా పదిబారలు ప్రాకేసరికి, ఒక్క వూపులో పులి తాటి

చెట్టెక్కి పంజాతో అతడిని బలంగా కొట్టింది. రంగన్న క్రింద పడ్డాడు. పులికూడా క్రిందపడింది. రంగన్న నడుం విరిగి లేవ లేక పోయాడు, పులి అతని తలను నోట కరుచుకొని చుట్టూ కెలికుజూసింది.

నా హృదయం జాలితో ద్రవించింది, పాపం! రంగన్న ఎంత దుర్మార్గుడైనా చివరకు ఒక దుష్ట జంతువును హత మార్చి ఊరి వాళ్లను రక్షించాలనే సదుద్దేశంతో సాహసానికి దిగాడు.

ఊళ్లో వాళ్లు మొత్తంమీద వందమందివరకు దూరంగా నిలబడ్డారు బరిసెలు, గొడ్డళ్లు కత్తులు రోకళ్లతో. ఆ జనాన్ని చూసి పులి నిశ్చేష్టితమై నిలబడింది. ఇదే అదనుగా తీసికొని దానిపై కత్తులు, గొడ్డళ్లు, బరిశెలు, రోకళ్లను జనం విసిరారు. ఒక బరిశె దాని తలలో గుచ్చుకుంది. ఒక గొడ్డలి దాని మెడపై గాయాన్ని కలిగించింది, ఒక రోకలి దానిడొక్కలో పొడుచుకుంది. కొన్ని క్షణాలలోనే పులికూడ కూలిపోయింది.

నాకంతా అద్భుతమైన ఆశ్చర్యంగా ఉంది. పెద్ద పులేమిటి? మా వూళ్లోకి రావడమేమిటి! దానికి మా వూరు పులి రంగన్న కనబడడమేమిటి?

ఆ రోజు సాయంకాలం పెద్దపులి చేతులలో వీరస్వర్గమలంకరించిన మా వూరు పులి రంగన్నను, ప్రజల చేతులలో దారుణంగా మృతి నొందిన పులిని మా వూళ్లో తప్పెట్లతో

తాళాలతో ఊరేగించారు. ఆ ఊరేగింపులో ఊళ్ళోవాళ్ళు చాలామంది ఉత్సాహంగా పాల్గొన్నారు, వాళ్ళ ఉత్సాహానికి కారణాలు రెండు : పెద్దపులిని చంపినందుకు, మా వూరు ప్రతిష్ఠ పెరిగినందుకూ !

మా బాబాయిగారి అరుగుమీద నిలబడి ఆ ఊరేగింపును తిలకిస్తున్న నన్ను ఇద్దరు కొత్త వ్యక్తులు ప్రశ్నించారు. "ఎక్కడిదా పులి ? ఇక్కడికెలా వచ్చింది ?"

"ఏమో! నాకు తెలియదు. వంద మైళ్ళ లోపు ఎక్కడా చిరుతపులి కూడా లేదు." అన్నాను నేను.

"అయితే, ఆ పులి మాదే అయివుంటుంది" అన్నాడొకాయన.

"అంటే___!"

"ఇక్కడికి పదిమైళ్ళ దూరంలో మా సర్కస్ కంపెనీ బస చేసివుంది. రాత్రి ఈ పులి తప్పించుకొచ్చింది. దానికోసం వెతుకుతూ ఇక్కడికి వచ్చాం," అన్నాడు సర్కస్ కంపెనీ మేనేజరు.